రమేష్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-హుకుంపేట:-కార్మికుల ఉద్యమ నేత కామ్రేడ్ ఎస్.రమేష్ ఏడో వర్ధంతిని పురస్కరించుకొని సిఐటియు అనుబంధ యూనియన్ నేతలు గురువారం నివాళులర్పించారు. అనంతరం వైస్ ఎంపీపీ కొండలరావు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.కృష్ణారావు మాట్లాడుతూ, కార్మికుల, ప్రజా సమస్యలపై రమేష్ ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన మహిళ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ హైమావతి, నాయకులు పోతురాజు, కొండబాబు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న నేతలు, విఒఎలు

పుట్టగొడుగుల్లా క్యాంపింగ్ టెంట్ల ఏర్పాటు

-ఐటిడిఎ పిఒ ఆదేశాలు బేఖాతరు

ప్రజాశక్తి-అరకులోయ :పర్యాటక కేంద్రమైన అరకులోయ ప్రాంతంలో క్యాంపింగ్ టెంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం పర్యాటక సీజన్ ప్రారంభం కావడంతో అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగూడ ప్రాంతంలో ఎక్కడ చూసినా టెంట్లు దర్శనమిస్తున్నాయి.
కొంతమంది స్థానిక గిరిజన యువత టెంట్లు ఏర్పటుతో కొద్ది నెలలు ఉపాధి పొందుతున్నామని అధికారులకు విన్నవిస్తుండడంతో వారి వినతి మేరకు పాడేరు ఐటిడిఎ స్పందించి టూరిస్ట్ సీజన్లో టెంట్లు నిర్వహణకు అనుమతికి ఇచ్చింది. క్యాంపింగ్ టెంట్లు నిర్వహించే వ్యక్తులకు కొన్ని షరతులతో కూడిన నియమ నిబంధనలు పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్ పెట్టారు. టెంట్ల నిర్వహణలో అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పాడేరు ఐటిడిఎ పిఒ కొన్ని బంధనలు జారీ చేశారు. అవి బేఖాతాలు చేస్తూ కొంతమంది టెంట్ల నిర్వాహకులు యధావిధిగా క్యాంపింగ్ టెంట్లు అనుమతి లేకుండా ఏర్పాటు చేశారు.
స్థానిక గిరిజనులను కొంతమంది మైదాన ప్రాంత క్యాంపింగ్ టెంట్లు నిర్వాహకులు మచ్చిక చేసుకుని లీజుల పేరుతో అనేకమంది బినామీల పేరుతో టెంట్ ల నిర్వహణకు పూనుకుంటున్నారు.
ఇటీవల స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో లాడ్జిల యజమానులు, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, ఎంపీడీవో, ఎంఆర్ఓ డిఎల్పిఒ, డిపిఓలతో పాడేరు ఐ టి డి ఎ పిఒ సమావేశం నిర్వహించి టెంట్స్ నిర్వాహకులు పాటించవలసిన నియమ నిబంధనలను వెల్లడించారు. ఈ సమావేశం నిర్వహించి సుమారు నెలరోజులు కావస్తున్నా ఇంతవరకు ఏ ఒక్కరు కూడా పోలీస్, ఎంపీడీవో, ఎంఆర్ఓ అనుమతులు తీసుకోలేదు. దీంతో టెంట్ నిర్వాహకులు వెంటనే అనుమతులు, ఎన్ఓసీలు అవసరమైన శాఖల నుంచి తీసుకోవాలని అరకులోయ ఎంపీడీవో లవ రాజు ప్రకటన జారీ చేశారు. అయినా ఒకరిద్దరు తప్ప మిగిలిన వారు ఇంతవరకు స్పందించలేదని తెలిసింది. క్యాంపింగ్ టెంట్ల నిర్వాహకులు ఆయా గుడారాల్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్ల సదుపాయం, మంచినీరు, రక్షణ కంచె ఏర్పాటు చేయాలని అధికారులు స్పష్టం చేశారు. నిర్వాహకులు ఎన్ని టెంట్లు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే ఎంపీడీవో, ఎమ్మార్వోల వద్ద అనుమతి తీసుకుని ఒక్కొక్క టెంట్‌కి ఐటీడీఏ పీవో నిర్ధారించిన రూ.500 చొప్పున మూడు నెలలకు సంబంధించిన రుసుము ముందే చెల్లించాలని, విద్యుత్ ,పోలీస్ అనుమతి పొందడంతో పాటు, టెంట్ లో బస చేసే పర్యాటకుల వివరాల కోసం రికార్డుల నిర్వహణ, ఆధార్ కార్డుల వివరాలు సేకరించాలని ఐటీడీఏ పీఓ స్పష్టం చేశారు.ఎవరో కొద్ది మంది తప్ప, ఎక్కువ మంది లీజుల పేరుతో ఉపాధి ఏరచూపి బినామీ గిరిజనేతరులే టెంట్ ల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బినామీలు నిర్వహించే టెంట్లు ఎత్తివేయాలని వారికి ఎటువంటి అనుమతులు ఇవ్వవద్దని అసలైన గిరిజన టెంట్ల నిర్వాహకులు డిమాండ్ చేశారు.

ఏర్పాటు చేసిన క్యాంపింగ్ టెంట్లు

అరకులోయ ప్రాంతంలో సుమారు 20 కి పైగా ప్రాంతాల్లో టెంట్లు నిర్వహణ స్థావరాలు ఏర్పాటు చేశారు. ప్రతి క్యాంపింగ్ టెంట్‌లో ఒక్కొక్క టెంట్ కి ఫర్ హెడ్ ఎంత రుసుము తీసుకుంటున్నారు. సింగల్ టెంటుకు ఎంత...? డబల్ టెంట్ కి ఎంత..? అన్నది నిర్దేశించిన ధరల పట్టిక ను పెద్ద ఫ్లెక్సీలు కొట్టించి వాటిలో పూర్తి వివరాలు పొందుపరచాలని అధికారులు ఆదేశించినా ఎక్కడా కూడా ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళలో డిజె సౌండ్ సిస్టంలు ఏర్పాటు చేస్తున్నారు.వీటిపై సంబంధిత అధికారులు స్పందించి ప్రతి టెంట్లో అక్కడి పరిస్థితులను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న టెంట్లను ఎత్తివేయాలని, బినామీ దారులు వేసిన టెంట్లు కూడా మూసివేయాలని స్థానికులు కోరుతున్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి

షెడ్యూల్డ్ ఏరియా ఉద్యోగ నియామక చట్టం చేయాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి డుంబ్రిడ: అసెంబ్లీ సమావేశాలలో చర్చించి షెడ్యూల్డ్ ఏరియా ఉద్యోగ నియామక చట్టం చేయాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస డిమాండ్ చేశారు. స్థానిక మండల కేంద్రంలోని కమ్యూనిటీ భవనంలో గురువారం ఆ పార్టీ మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, మెగా డీఎస్సీ తోపాటు స్పెషల్ డిఎస్సి కలిపి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. వంద శాతం రిజర్వేషన్ కల్పించిన జీవో 3ను పునరుద్ధరిస్తానంటూ ఎన్నికల ముందు అరకులో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన చేయలేదన్నారు. అధికారం చేపట్టి నాలుగైదు క్యాబినెట్ సమావేశాలు జరిగినా చర్చ కూడా జరపలేదని విమర్శించారు. షెడ్యూల్డ్ ఏరియా ఉద్యోగ నియామక చట్టంపై చర్చించి చట్టం చేసిన తర్వాత మెగా డీఎస్సీ ,స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. పి వి టి జి గిరిజనులకు మంజూరు చేసిన పీఎం జన్మన్ గృహ పథకంలో భాగంగా లబ్ధిదారులకు ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఈనెల 8 నుంచి 14 వరకు ప్రజా పోరు కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని, చివరి 14 రోజున అన్ని మండల కేంద్రంలో నిరసన ప్రదర్శనలు చేయడం జరుగుతుందన్నారు. ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తామని చెబుతున్నా ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కడా అమలు కాలేదన్నారు. విచ్చలవిడిగా మద్యం విక్రయాలు చేపడుతున్నారని విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే నిలుపుదల చేసే విధంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీల పేరుతో భారాన్ని ప్రజలపై మోపారన్నారు. మండలంలోని పెదపాడు, శీలం గొంది గడ్డల్లో వెంటనే వంతెనలు నిర్మించాలని చెప్పారు. శీలం గొంది వంతెన 2014లో కురిసిన హుదూద్ తుఫాన్ కు కొట్టుకుపోయిన ఇప్పటికి ఎటువంటి పునర్నిర్మాణ పనులు చేపట్టలేదని చెప్పారు. పెదపాడు ప్రాంత గిరిజనులకు చాపరాయి జలపాతం గెడ్డ వద్ద వంతెన నిర్మించాలని వంతెన లేక ఆ ప్రాంత గిరిజనులు రవాణా సౌకర్యానికి వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నార న్నారు. వచ్చేనెల 2 నుంచి 4 వరకు పాడేరులో సిపిఎం జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని.2, 3 న ఆదివాసి గిరిజన సంప్రదాయ కళ నృత్యాలను ప్రదర్శించి 4న బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. దీనికి ముందు పార్టీ జెండాను మండల సీనియర్ నాయకుడు పి మత్తు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు, నాయకులు పి.సురేష్‌కుమార్, టి.సూర్యనారాయణ, పి.సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అప్పలనర్స

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- పెదబయలు :స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నిఖిల్ ఆధ్వర్యంలో క్యాన్సర్ పై ప్రాథమిక. ఆరోగ్య కేంద్రం నుండి మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు అంబేద్కర్ కూడలి జంక్షన్ వద్ద మానవ హారం నిర్వహించారు ఈ కార్యక్రమం లో. ఎంపీఎచ్ఓ వెంకటరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

డుంబ్రిగుడ : ముందస్తు గుర్తింపుతో క్యాన్సర్ వ్యాధి నిర్మూలనకు దోహదపడుతుందని వైద్యాధికారి రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్సీలో క్యాన్సర్ అవగాహన కల్పించారు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షకు స్క్రీనింగ్ లోనే సాధ్యపడుతుందన్నారు. ఖైనీ, గుట్కా, పాన్ పరాగ్, దుమపానం అలవాట్లు ఉన్నవారు స్క్రీనింగ్ పరీక్షలను చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈఓ శౌరి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-హుకుంపేట:మండలం లోనిగన్నేరుపుట్టు పంచాయితీ గవ్వలమామిడి గ్రామంలో జేజేఎం తాగునీటి పైప్ లైన్ పనులను హుకుంపేట మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, గన్నేరుపుట్టు సర్పంచ్ సోకేలి కృష్ణారావు లు కలిసి గురువారం ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూతాగునీరు సౌకర్యం లేక పోవడంపై సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్రామంలోని జల జీవన్ మిషన్ ద్వారా నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గన్నేరుపుట్టు మాజీ వైస్ సర్పంచ్ బద్నైని రాజారావు, గ్రామ వార్డ్ మెంబర్ పాడి బోడన్న, డొంకిన వలస వార్డ్ మెంబర్ మజ్జి రాజారావు,ఉపాధి హామీ వీఆర్పీ పాంగి జోగన్న, గ్రామ పెద్దలు బీ సుందర్ రావు, గణేష్, అంగన్ వాడి టీచర్ శాంతి పాల్గొన్నారు.

ఇకెవైసికి మార్చి 31 వరకు గడువు

ప్రజాశక్తి-పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దీపం 2.0 ఉచిత గ్యాస్ పొందడానికి వచ్చే మార్చి 31 లోపు లబ్దిదారులు ఇకెవైసి చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ స్పష్టం చేసారు. ఉచిత గ్యాస్ పంపిణీ ఇకెవైసీపై గురువారం ఆయన కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. అర్హులైన లబ్దిదారులకు ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు సరఫరా చేస్తారని చెప్పారు. లబ్దిదారులకు ఆధార్ కార్డు, రైస్ కార్డు, ఎల్.పి.జి కనెక్షను ఉండి ఇకెవైసీ చేసుకోవాలని పేర్కొన్నారు. లబ్దిదారులు ముందుగా నగదు చెల్లించి గ్యాస్ సిలెండర్ విడిపించుకోవాలని చెప్పారు. సిలెండర్ తీసుకున్న తరువాత 48 గంటల్లో లబ్దిదారుల ఖాతాలో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 23 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 2 లక్షల 28 వేల 955 గ్యాస్ కనక్షన్లు ఉన్నాయని అన్నారు. ఇప్పటి వరకు లక్ష 46 వేల 508 మంది లబ్దిదారులకు ఇకెవైసీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో 34 ఇకెవైసీ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసామని చెప్పారు. అవసరమైన చోట అదనపు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డి ఎస్ ఓ బి. గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఉజ్వల భవిత

ప్రజాశక్తి-అరకులోయ :పట్టుదల ఉంటే పేదరికం విద్యకు అడ్డు కాదని దీంతో, ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు అన్నారు. స్థానిక ఐటిఐ లో చదువుతున్న పేద విద్యార్థి పాడి చందుకు యూనిఫామ్ కొరకు ఆర్థిక సహాయం చేశారు. క్రమశిక్షణతో కూడిన విద్యను చదవడం ద్వారా మంచి భవిష్యత్తు పాటు సమాజాన్ని కూడా మేలు జరుగుతుందన్నారు. పేదలకు సహాయపడేందుకు పట్టాసి ఫౌండేషన్ స్థాపించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ బలరాం, అధ్యాపకేతర సిబ్బంది కె.గోపాలకృష్ణ పాల్గొన్నారు.



వితరణ ఇస్తున్న ప్రిన్సిపల్

పెండింగ్ బిల్లులు చెల్లించాలని అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు గురువారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా నాయకులు కె.వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు చిన్ని కుమారి మాట్లాడుతూ మండలంలోని రాజవొమ్మంగి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 101 అంగన్వాడి కేంద్రాలు ఉండగా, వాటిలో 84మంది మెయిన్ వర్కర్లు, 17మంది మినీ వర్కర్లు, 84మంది హెల్పర్లు సమర్థవంతంగా తమ విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. వీరందరికీ గత 8 నెలలుగా కూరగాయలు, గ్యాస్, రవాణా ఇతర బిల్లులు సుమారు రూ.6 లక్షలు వరకు రావాల్సి ఉందని చెప్పారు. పీఎంఎస్‌బివై, పీఎంజేజేబివై వంటి బిల్లులు వేస్తామని బ్యాంక్ స్టేట్మెంట్లు కూడా తీసుకురమ్మని చెప్పారని, కాని ఎటువంటి బిల్లులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర జీతాలతో పని చేస్తున్న అంగన్వాడీలకు బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. తమ బిల్లులు చెల్లించాలని గురువారం అధికారులను కోరితే ఒకరి మీద ఒకరు నెపం నెట్టుకోవడం సరికాదన్నారు. అంగన్వాడీల బిల్లుల బడ్జెట్‌కు సంబంధించి సుమారు రూ.5.42 లక్షల బడ్జెట్ వెనక్కి పోయిందని, దీనికి స్థానిక ఐసిడిఎస్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని పేర్కొన్నారు. వారం రోజుల్లో తమ బిల్లులు తమ ఖాతాలో జమ చేయకపోతే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక ఐసిడిఎస్ సిడిపిఓ దేవామణికి అందజేశారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణి, సుందరమ్మ, పొన్నాలు, సత్యవతి, రత్నకుమారి పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కేన్సర్‌పై అప్రమతంగా ఉండాలి

ప్రజాశక్తి -సీలేరు

క్యాన్సర్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్సీ వైద్యాధికారులు డాక్టర్ ఖాదర్ మస్తాన్ వల్లి, డాక్టర్ సౌమ్య ప్రజలకు అవగాహన కల్పించారు. జాతీయ క్యాన్సర్ డే సందర్భంగా జీకే విధి మండలం సీలేరులో క్యాన్సర్ పై అవగాహన శిబిరం నిర్వహించారు. ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. అనంతరం మానవహారంగా చేపట్టారు. వైద్యాధికారులు ఖాదర్ మస్తాన్ వల్లి, డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ స్త్రీలు పురుషులకు క్యాన్సర్ లక్షణాలు గురించి ప్రజలకి అవగాహన కల్పించాలన్నారు. స్త్రీలకు ముఖ్యంగా రొమ్ముపై కణితలు ఏర్పడి బెస్ట్ క్యాన్సర్‌కి దారితీస్తుందని కణితలు రొమ్ముపై ఉన్నట్లయితే స్త్రీలు గుర్తించిన వెంటనే స్థానిక పిహెచ్సికి సంప్రదించి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. పురుషులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కే.జొజిబాబు, ఆరోగ్య పర్యవేక్షకులు త్రినాధరావు, మహిళ పర్యవేక్షకులు బాలామణి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎం కుమారి, దేవి, ఆశా వర్కర్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిఈటి, విద్యార్థులు పాల్గొన్నారు.

మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెం గ్రామంలో క్యాన్సర్‌పై సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోతుగూడెం పిహెచ్‌సి వైద్యాధికారి నఫియా సుల్తానా మాట్లాడుతూ ప్రజలు క్యాన్సర్ బారిన పడకుండా ఆరోగ్యాన్ని రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో మోతుగూడెం పిహెచ్‌సి సూపర్వైజర్స్, ఆశా వర్కర్లు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సీలేరులో మానవహారం చేస్తున్న దృశ్యం

వంతెన నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని గంగన్న మెట్ల గ్రామం వెట్టివారు గుంపు వెళ్లాలంటే గుట్ట కాలువపై వంతెన లేకపోవడం గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే గుట్టకాలపై వంతెన నిర్మాణం చేపట్టాలని సిపిఎం గ్రామశాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు గంగన్న మెట్ల సిపిఎం గ్రామశాఖ మహాసభ గురువారం జరిగింది. ఇందులో పాల్గొన్న సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ మాట్లాడుతూ గ్రామం నుండి పాఠశాలకు, ఆసుపత్రికి, నిత్యావసరాలు తెచ్చుకోవడానికి వెళ్లాలంటే ప్రతి ఏటా జూన్ నుండి జనవరి వరకు చాలా ఇబ్బందులు పడవలసి వస్తుందని తెలిపారు. కాలువ ప్రవాహంతో ఉన్న వంతెన పూర్తిగా ధ్వంసమైందని, కనీసం ద్విచక్ర వాహనం కూడా రాలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. తక్షణమే అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కరించాలని కోరారు. గ్రామంలో మంచినీటి మోటర్‌కు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆసు గణేష్, వేకా రాజ్ కుమార్, ముర్రం రంగమ్మ, ముట్టం రాజయ్య, కుంజా నాగయ్య, కుంజ నారాయణ, వెట్టి రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

పిఎం జన్‌మన్ హౌసింగ్ యూనిట్ ధర

రూ.5 లక్షలకు పెంచాలని ధర్నా

ప్రజాశక్తి -సీలేరు

పిఎం జన్‌మన్ పథకం కింద మంజూరు చేసే హౌసింగ్ యూనిట్ ధరను రూ.5 లక్షలకు పెంచాలని కోరుతూ ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, సిఐటియు ఆధ్వర్యాన లబ్ధిదారులు జీకే వీధి మండల గృహ నిర్మాణ శాఖ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కొర్ర బాలయ్య, సిఐటియు నాయకులు గడుతూరి సత్యనారాయణ మాట్లాడుతూ పిఎం జన్‌మన్ జనరల్ హౌసింగ్‌కి ఇస్తున్న యూనిట్ ధర సరిపోక లబ్ధిదారులు అప్పులు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం అన్నింటి ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చే యూనిట్ ధర ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా యూనిట్ ధర ఒక్క ఇంటికి రూ.5 లక్షల కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటి సర్వే చేసేదని, ప్రస్తుత ప్రభుత్వం వాలంటరీ వ్యవస్థ రద్దు చేయడంతో లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామస్థాయిలోనే సర్వే చేపట్టి ఆదివాసీలకు మేలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల హౌసింగ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

విచారణ నిర్వహిస్తున్న అధికారులు

బియ్యం అక్రమ నిల్వపై విచారణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

స్థానిక బాలికల గురుకుల కళాశాలలో బియ్యం అక్రమ నిల్వలపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ రాజు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి తదితరులు విచారణ చేపట్టారు. విద్యార్థులకు వండి పెట్టాల్సిన బియ్యాన్ని కళాశాల ప్రిన్సిపల్ సలోమి అక్రమంగా నిల్వ చేయడంపై ఇటీవల ఉన్నతాధికారులు ఆమెను సస్పెండ్ చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో కళాశాల విద్యార్థులు సిబ్బందితో సమగ్ర విచారణ చేపట్టారు. బియ్యం అక్రమంగా ఎందుకు నిల్వ చేయవలసి వచ్చిందో అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు నివేదికలను ఉన్నతాధికారులకు అందజేసి వారి ఆదేశాల మేరకు సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏటిడబ్ల్యూఓ కృష్ణ మోహన్, ఐటిడిఎ గురుకులం సెల్ అసిస్టెంట్ ఎస్.నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు

'జల ఉత్సవ్'పై అవగాహన

ప్రజాశక్తి-విఆర్.పురం

పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యాన జల ఉత్సవ్ కార్యక్రమంపై మండల కేంద్రం రేఖపల్లి ఎంపిడిఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉల్లాస్ వాలంటీర్లకు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి కారం లక్ష్మి, జెడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్ర జల వనరుల శాఖ అదేశాలతో నీటి వనరుల పరిరక్షణ, సంరక్షణపై ఈ నెల 6 నుండి 20వ తేదీ వరకు జల ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు నీటి వినియోగంపై అవగాహన కల్పించడం ద్వారా భావి తరాలకు నీటి ఇబ్బంది లేకుండా చూడాల్సి ఉందని చెప్పారు. అడుగంటుతున్న భూగర్భ జలాలను కాపాడుకునే బాధ్యత మనందరిపైనా ఉందన్నారు ఎంపిడిఓ శశి భూషణ్‌రావు, వెలుగు ఏపీఎం, ఐసిడిఎస్, ఎన్‌ఆర్ఇజిఎస్, ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలుపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

శాసనమండలి ఎన్నికలు నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియామవాళి అమలులో ఉన్నందున ఎన్నికల కోడ్ అమలుపై ఎంపిడిఒ తూతిక శ్రీనివాసవిశ్వనాథ్ గురువారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మోడల్ కోడ్ అఫ్ కాండక్ట్ అమలు చేయడంపై ఆరా తీసారు. ఎన్నికల నియామవాళిని అతిక్రమించిన సిబ్బందిపై చర్యలుంటాయని హెచ్చరించారు. విగ్రహాలకు ముసుగువేసి, సంబంధిత పార్టీ వారికి సమాచారం ఇచ్చి ఫ్లెక్సీలు తొలగించాలని సూచించారు. రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుభంద సంఘాల వ్యక్తులు ఎన్నికల ప్రవర్తన నియామవాళిని గౌరవించాలని కోరారు. ర్యాలీలు, ఎన్నికల ప్రచారాలకు సంబంధిత వ్యక్తులు, వాహనాలకు అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రత్నకుమారి, ఆర్‌డబ్ల్యూయస్ ఏఈ నారాయణ, ఏపిఓ మణికుమారి, ఏపియం సుధాకర్, మారేడుమిల్లి మండల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఓ శ్రీనివాస్ విశ్వనాథ్

కాఫీ ధరలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న కాఫీ ఉద్యాన వన అధికారి

ప్రజాశక్తి డుంబ్రిగుడ:- కాఫీ పంటను కొనుగోలు చేసేందుకు ఐటిడిఏ, జిసిసి నిర్ణయించిన ధరలతో పాటు కాఫీ పళ్ళు సేకరణ, నాణ్యమైన కాఫీ తయారీపై గుంట సీమ, గుంట గన్నెల, రంగిలిసింగి పంచాయతీ గ్రామల్లో కాఫీ ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో గురువారం గిరిజనులకు అవగాహన పరిచారు. ఈ సందర్భంగా కాపీ ఉద్యాన అధికారి శెట్టి మత్స్యరాజు మాట్లాడుతూ, ఐటిడిఏ నాణ్యమైన కాపీ పనులకు రూ 44లకు తీసుకుంటుందన్నారు. జిసిసి పార్చ్ మెంట్ కాపీకు రూ 285, చెర్రీ కాపీ కు రూ 150ల చొప్పున కొనుగోలు చేసేందుకు ధరలు నిర్ణయించిందన్నారు. ఈ ధరలకు తగ్గించి ఎవరైనా కొనుగోలు చేయడానికి వస్తే ఎవరు కూడా విక్రయించ వద్దని సూచించారు. దళారులను నమ్మి ఎవరు కూడా మోసపోవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో లైజన్ వర్కర్లు జి ఇడ్డిక, స్వామి నాయుడు ,గోపీనాథ్, బలరం, భగత్ రావు, రాము, శివ,

13న జాబ్ మేళా

ప్రజాశక్తి-పాడేరు:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉపాధి కార్యాలయం, సీ డా ప్ సంయుక్త ఆధ్వర్యం లో అరకు వేలి ఆర్ ఐ టి ఐలో ఈనెల 13వ తేదీన (బుధవారం) ఉదయం 10గంటలకు 4 కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ,జిల్లా నైపుణ్యావృద్ధి అధికారి పి రోహిణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మినీ జాబ్ మేళా లో పారడైస్ ఫుడ్ కోర్ట్, విన్నర్ సాఫ్ట్ సొల్యూషన్, మెడిప్లస్ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లాలోని 18 సంవత్సరాల నుండి 30సంవత్సరాల మధ్య గల పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఆపై చదువు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూ కు పాన్ కార్డు, ఆధార్ కార్డు, సరిఫికేట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు జీతం రూ.10,000 నుండి 14,000 వరకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్: 94910 57527, 9398338105 సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న అన్ని ఎన్‌జిఒలు, సిఎస్ఆర్ మంజూరు చేసే కంపెనీలు, లాభాపేక్ష లేని సంస్థల నుండి జిల్లా పరిపాలనలో చేరి అర్థవంతమైన మార్పును సృష్టించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ ఫోరమ్ కు జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్ అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న లాభాపేక్షలేని స్వచ్ఛంద సంస్థలు ఈఎన్జీఓ ఫోరమ్ లో చేరడానికి సంసిద్ధతను తెలపాలని పేర్కొన్నారు. ఈ నెల 8 తేదీ నుండి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రారంభమవుతుందని చెప్పారు. నమోదు చేసుకోవడానికి 20 తేది వరకు గడువు ఉందని చెప్పారు. ఇతర సందేహాల కోసం నారాయణరెడ్డి : 8106797474 మొబైల్ నెంబర్ లో సంప్రదించాలని సూచించారు.

గిరిజన అభ్యర్థులతోనే పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి- అరకులోయ :రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రకటించ బోతున్న జనరల్ డీఎస్సీ 2024 నోటిఫికేషన్ లో ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న పోస్టులను గిరిజన నిరుద్యోగ అభ్యర్థులతోనే 100 శాతం ఉద్యోగ నియామకం చేయాలని, జీవో నెంబర్- 3 ను పునరుద్ధరించి ప్రత్యామ్నాయంగా నూతన జీవో ను విడుదల చేసి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఏజెసి పిలుపు మేరకు డీఎస్సీ అభ్యర్థులు ఉద్యోగ సంఘాల నాయకులు 48 గంటల ఆదివాసుల ఆవేదన దీక్ష ముగిసింది.

ఈ కార్యక్రమంలో ఆయా ఉద్యోగ ఉపాధ్యాయ, విద్యార్థి ప్రజా సంఘాలు దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం అరకు వేలి మండల అధ్యక్షుడు జన్ని సింహాచలం, అధ్యాపకులు కామేష్, ఉపాధ్యాయులు: ప్రసాద్, చందు, జేఏసీ జిల్లా, మండల నాయకులు మహాదేవ్, కన్వీనర్ గోపాల్, ఆనంద్, బుద్దు, సిద్దు, నారాయణ, మోహనరావు, నాయకులు ప్రసన్న కుమార్, ధర్మసీతారాం, లక్ష్మి నారాయణ,శంకర్, తత్తర్లు పాల్గొన్నారు.

కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలి

డుంబ్రిగుడలో విఒఎల నిరసనలో మాట్లాడుతున్న సురేంద్ర

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:- వెలుగు శాఖలో పనిచేస్తున్న వీఓఏలకు జారీచేసిన మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సురేంద్ర డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ జంక్షన్ దగ్గర వీఏవోలు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారికి సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతో పాటు మూడేళ్ల కాల పరిమితిని విధించడం సరికాదన్నారు. .

ముంచింగిపుట్టు: మండలంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద వెలుగు విఓఎల నిరహార దీక్ష రెండవ రోజు కొనసాగించారు.

హుకుంపేట:మండల కేంద్రంలో వెలుగు వివోఏలు చేపట్టిన నిరసనకు వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, ఆదివాసి గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ హైమావతి, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి. కృష్ణారావు పాల్గొని మద్దతు ప్రకటించారు. వెలుగు వివోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసిల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో మెమోరాండం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఆరు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ ఉపాధ్యక్షులు పోతురాజు, యూనియన్ నాయకులు కొండబాబు, పద్మ, రత్నకుమారి, రమణ, మనీష్ కుమార్, సోమన్న, ఆనంద్, అప్పలరాజు, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సీలేరు:వెలుగు వివోఏలకు రాష్ట్ర ప్రభుత్వం విధించిన మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యూలర్‌ను వెంటనే రద్దు చేయాలని, ఎనిమిది నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని, అక్రమంగా తొలగింపులు, వేధింపులు ఆపాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం తహశీల్దారు, ఎంపిడిఒ కార్యాలయాల వరకు ర్యాలీలు నిర్వహించి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ మాట్లాడుతూ వివోఏలకు 8 నెలల నుండి జీతాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర బాలయ్య, వివోఏల సంఘం మండల అధ్యక్షులు పాంగి పుష్ప, కార్యదర్శి చిలకల రామలింగం, సహాయ కార్యదర్శి సిరిబాల శోభన్ బాబు, చంటి, శ్రీను, అధిక సంఖ్యలో వివోఏలు పాల్గొన్నారు.

చింతపల్లి :ప్రభుత్వాలు మారినా కార్మికుల బతుకుల్లో మార్పు రాలేదని సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. గురువారం చింతపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా వెలుగు వివో ఏ రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించారు. సిఐటియు నేత రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడిన చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ, ఈ రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం విఒఎ సమస్యలపై కనీసం స్పందించకపోవడం దుర్మార్గమని విమర్శించారు. ఆరు నెలల నుంచి జీతాలు లేక ఎలా బతుకుతారని ప్రశ్నించారు, ఈ కార్యక్రమంలో వెలుగు వివోఏ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు దుర్గ, సత్యనారాయణ, సుమ, సుబ్బారావు పాల్గొన్నారు.

అనంతగిరి:మండలం కేంద్రంలో విఒఎ ఆందోళనకు జెడ్పిటిసి దీసరి గంగరాజు మద్దతు తెలిపారు. అనంతరం మండల వెలుగు కార్యాలయంలో ఏపీ ఎం మురళిని కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని లిఖితపూర్వకంగా విన్నవించారు. అనంతరం గంగరాజు మాట్లాడుతూ విఒఎల నుంచి విధుల నుండి తొలగింపు నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. ఆరు నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలన్నారు. గతంలో ఇచ్చిన హామీలను తక్షణమే ప్రభుత్వం పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. పోరాటంతోనే సమస్యలు పరిష్కారం సాధ్య పడతాయని, ప్రభుత్వం దిగివచ్చేంత వరకు పోరాటాన్ని కొనసాగించాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల సిఐటియు నాయకులు కిల్లో మొస్య, మండల విఒఎల ప్రతినిధులు. రంజిత, హరిక్రిష్ణ, దిలీప్ పాల్గొన్నారు

అనంతగిరి, హుకుంపేట, సీలేరులలో ఆందోళన చేస్తున్న విఒఎలు, అనంతగిరి, హుకుంపేటలో వినతిపత్రం అందజేత

చింతపల్లిలో మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

నవజాత శిశువుల రక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-పాడేరు: నవ జాత శిశువు రక్షణ బాధ్యత అందరిపైనా ఉందని జాయింట్ కలెక్టర్ . ఎం. జె. అభిషేక్ గౌడ్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా లీగల్ సెల్ అథారిటీ సంయుక్తంగా శిశు సంరక్షణపై గురువారం నిర్వహించిన అవగాహనా సదస్సుకు అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుట్టిన బిడ్డ సురక్షితంగా ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి గర్భం దాల్చిన దగ్గర నుండి నెలనెలా వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు. ఆసుపత్రిలో ప్రసవం తల్లిబిడ్డకు క్షేమమని అన్నారు. చిన్న పిల్లల్లో సహజంగా రోగ నిరోధక శక్తి తక్కుగా ఉంటుందని, నవ శిశు జన్మించిన దగ్గర నుండి ఆరు నెలల వరకు తల్లిపాలను పట్టించాలని అన్నారు. ఆరు నెలల తరువాత అదనపు పోషకాహారం బిడ్డకు అందించాలని పేర్కొన్నారు. పసిపిల్లలకు పసర మందులు వినియోగించకూ డదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నవజాత శిశు సంరక్షణపై గ్రామీణ ప్రాంతాలలో అవగాహన కల్పించాలని సూచించారు.

ఐటిఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ మాట్లాడుతూ, ఆసుపత్రి ప్రసవాలు పెరగాలన్నారు. గ్రామాల్లో వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు.

ఐసిడిఎస్ పథక సంచాలకులు సూర్యలక్ష్మి మాట్లాడుతూ, త్వరలో ఊయల ప్రొగ్రాం అమలు చేస్తున్నామన్నారు. బిడ్డలను సంరక్షిద్దామని పిలుపు నిచ్చారు. శిశువులను ఊయలలో వేసి వెళితే సంరక్షణ చర్యలు

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

చేపడతామన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ భాషా, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరిండెంట్ విశ్వామిత్ర మాట్లాడుతూ, పుట్టిన పిల్లలకు తల్లిపాలు మాత్రమే పట్టాలన్నారు. డబ్బా పాలు, ఆవుపాలు వంటి పట్టకూడదన్నారు. జిల్లాలో నిరక్ష్యరాస్యత ఉన్నందున గ్రామీణ ప్రాంతాలలో పసర మందులు వినియోగిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో సిడిపిఓ ఝాన్సీ లక్ష్మి, సూపరిండెంట్ బలివాడ వేంకటేశ్వరరావు, డి ఎల్ ఎస్ ఎ సభ్యులు టి.ప్రసాదానాయుడు, మిషన్ వాత్సల్య ప్రొగ్రాం అధికారి ఎస్. అశోక్ పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాల్లో డస్ట్‌బిన్ల ఏర్పాటు

- ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి .అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు : పర్యాటక ప్రాంతాల్లో డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. గురువారం ఐటీడీఏ కార్యాలయం నుండి పాడేరు, అనంతగిరి, అరకు వ్యాలీ, చింతపల్లి తహసిల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని సూచించారు. పర్యాటకులు ప్లాస్టిక్ సంచులు, వాటర్ బాటిల్స్ వెంట తీసుకు రాకుండా నియంత్రించాలని చెప్పారు. ప్లాస్టిక్‌ను నియంత్రించి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్ కుమార్, తహశీసిల్దార్‌లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు కృషి చేయాలి

ప్రజాశక్తి అనంతగిరి:వెలుగు డ్వాక్రా పొదుపు సంఘాలు మరింత ఆర్థిక అభివృద్ధి దిశగా ముందుండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పిడి మురళి తెలిపారు. గురువారం అనంతగిరి మండల వెలుగు ప్రాజెక్టు కార్యాలయం వద్ద అనంతగిరి. అరకు. డుంబ్రిగూడ మండలాల ఏపిఎం, సీసీలు సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాలతో పాటు గ్రామైక్య సంఘాలు మరింత బలోపేతం కావాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని తెలిపారు.వడ్డీ రుణాలు చెల్లింపులతో సంఘాలూ ఆర్థిక అభివృద్ధి చెందాయో లేదో మండలాల వివరాలను అందజేయాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో ఏజీఎం .కామరాజు ఎస్సార్. ఫైనాన్స్ . ప్రసాద్ పాల్గొన్నారు

డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులను అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కో-ఆర్డినేటర్ సతీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి అనుభవిజ్ఞులు అయిన ఉపాధ్యాయులతో కంచరపాలెంలోని బొట్టా నరసింగరావు ఫౌండేషన్ భవనంలో ఉచిత శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు 9347205549 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జాతీయ పోటీలకు అంపైర్‌గా శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ విశాఖపట్నంలో పనిచేస్తున్న డివిఎస్‌వై.శర్మను నవంబర్ 24 నుండి 29 వరకు చండీఘర్‌లో జరగనున్న 51వ ఆల్ ఇండియా ఇంటర్ ఇనిస్టిట్యూషనల్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ 2024కు ఇంటర్నేషనల్ బ్లూ బడ్జ్ అంపైర్‌గా ఎంపిక చేసినట్లు టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గానూ, విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగానూ ఉన్నారు.

ఆలయాల సందర్శనలో పాట్నా హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని రంపలో ఉన్న మల్లికార్జున స్వామిని ఆలయాన్ని గురువారం పాట్నా హైకోర్టు జడ్జి అనుపమ చక్రవర్తి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. రంపచోడవరం మండలం ఐ పోలవరంలో ఉన్న వెంకటేశ్వర స్వామికి పూజలు చేశారు. మండలంలోని రంప గ్రామంలో 12వ శతాబ్దంలో చోళులు నిర్మించిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున, స్వామిని దర్శించుకున్నారు ఆలయ అర్చకులు ప్రసన్న కుమార్, శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం పూర్వపరాలను విశిష్టతను హైకోర్టు జడ్జ్ అనుపమ చక్రవర్తికి వివరించారు. అనంతరం రంపచోడవరం లోని ఉన్న భూపతిపాలెం జలాశయాన్ని సందర్శించి తిరుగు ప్రయాణంలో బాపనమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొచ్చా అర్జున్ (58) గుండెపోటుతో రాజమండ్రి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం పాఠశాలలో తరగతి గదిలోనే అస్వస్థతకు గురై ఒక్కసారిగా కుప్ప కూలిపోవడంతో రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మంచివాడిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన అర్జున్ మాస్టారు బుధవారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందడంతో మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉపాధ్యాయుడు అర్జున్ మృతికి ఎపి ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె.సూరిబాబు, కె.జగన్నాథం, ఎం రమేష్ బాబు, డి పైడిమల్లు, పి రమణ, బి.కృష్ణ, వి అప్పారావు తదితరులు సంతాపం తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని పెద్ద ఆర్కూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా పని చేసి బదిలీ అయిన శివకుమార్‌ను గురువారం పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ నాగమణి మాట్లాడుతూ పెద్ద ఆర్కూర్ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రజల సమస్యలపై పంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకొని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. తన ఉద్యోగ బాధ్యతను నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి డి అమ్మాజీ, పంచాయతీ ఇంచార్జి సెక్రెటరీ, వీఆర్వో పైదా రాజారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మోహన్, గ్రామ సచివాలయం సిబ్బంది, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బాబు బోరయ్య తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-ఎటపాక : మండలంలోని కృష్ణవరం గ్రామ పంచాయతీ గొందిరాజుపేట (కారం వారి గుంపు)లో గురువారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కారం రవి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేనందున ప్రాణాపాయం తప్పింది. ఇంట్లో ఉన్న ఫర్నిచర్, విద్యార్థుల సర్టిఫికెట్స్, బ్యాంకు పాస్ బుక్స్, పట్టా పాస్ పుస్తకాలు, ఫ్రిజ్, కూలర్, బంగారం, నగదు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.2 లక్షలు వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని, నిలువ నీడ లేకుండా పోయిందని బాధితుడు రవి కన్నీరుమున్నీరయ్యారు.

‘ఉక్కు’పై చేతులెత్తేసిన బాబు

వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్, ఎంపీ విజయసాయి రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ ఉక్కు విషయంలో సిఎం చంద్రబాబు చేతులెత్తేసారని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్, ఎంపీ విజయసాయి రెడ్డి అన్నారు. రీజనల్ కో-ఆర్డినేటర్‌గా పార్టీ అధిష్టానం నియమించిన తర్వాత ఆయన విశాఖలో తొలి సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ అధ్యక్షతన ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలతో ఈ సమావేశం సాగింది. ఈ సందర్భంగా విజయసాయి రెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణను చంద్రబాబు నాయుడు పూర్తిగా విస్మరించారన్నారు. లక్షల కోట్ల విలువ చేసే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని వేల కోట్లకు విక్రయించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. తాము మొదటి నుంచి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉన్నామని చెప్పారు. అమరావతిని అభివృద్ధి చేయడం కోసం ఉత్తరాంధ్రకు చంద్రబాబు అన్యాయం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. అందులో భాగంగానే ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయాన్ని విశాఖ నుంచి అమరావతికి తరలించే కుట్ర చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతుందని, భవిష్యత్తులో ఉత్తరాంధ్రలో నియోజకవర్గాల సంఖ్య 44 పెరుగుతుందని చెప్పారు. మహిళా కోటాతో పాటు రిజర్వేషన్లు పలుచోట్ల మారతాయని వివరించారు. ఈ పరిణామాలన్నింటినీ చర్చించుకుని రాబోయే ఎన్నికలకు సిద్ధమవుతామని తెలిపారు. తాము అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో కార్యకర్తలను నిర్లక్ష్యం చేసిన మాట నిజమేనని వెల్లడించారు. ఇప్పటి నుంచి కార్యకర్తల అభివృద్ధికి పాటు పడతామని చెప్పారు. సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర, శాసన సభ్యులు ఆర్.మత్స్యలింగం, శాసన మండలి సభ్యులు వరుదు కల్యాణి, రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, కన్నబాబు రాజు, కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అదీప్ రాజు, చింతలపూడి వెంకట రామయ్య, భాగ్యలక్ష్మి, శోభా హైమావతి, సమన్వయకర్తలు కెకె.రాజు, మలసాల కిషోర్, పి.వరలక్ష్మి, నాయకులు రవి రెడ్డి, ఉరుకూటి అప్పారావు పాల్గొన్నారు.

పిహెచ్‌సిని తనిఖీ చేసిన డిఎం అండ్ హెచ్‌ఒ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:-మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ బాషా గురువారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పీ హెచ్ సీలో సందర్శించిన ఆయన రికార్డులను పరిశీలించారు. రోజు వారి రోగుల సందర్శనపై అడిగి తెలుసుకున్నారు. మందుల గదిని పరిశీలించారు. పూర్తిస్థాయిలో మందులు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాలింతల వార్డుకెళ్లిన ఆయన వైద్యం అందుతున్న తీరును బాలింతలను అడిగి తెలుసుకున్నారు. నైట్ వాచ్మెన్, స్వీపర్, వైద్య సిబ్బంది ఉండేలా భవనాలను ఏర్పాటు చేయాలని వైద్యాధికారి రాంబాబు ఆయన దష్టికి తీసుకెళ్లారు. వైద్యాధికారిణి అంభిక, వైద్య సిబ్బంది శౌరి, దీన, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా కేంద్రంలోని తలారసింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల ప్రాంగణం లో గురువారం భారత స్కౌట్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కుమారి రజిని, విద్యాశాఖ ఏడి వినయ్ మోహన్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె రామారావు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ, స్కౌట్స్ అండ్ గైడ్‌తో క్రమశిక్షణ అలవడుతుందన్నారు.

పిహెచ్‌సిలో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి -హుకుంపేట:ఉప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు సౌకర్యాలు కల్పించాలని పట్టం సర్పంచ్ కించాయి కృష్ణ కోరారు. ఆయన శుక్రవారం పర్యటించి రోగులను పరామర్శించారు. చిరిగిన బెడ్లను పేషెంట్లను పడుకోబెట్టడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. బెడ్లు, బెడ్ షీట్లు పేషెంట్లకు ఇవ్వాలన్నారు. ఆయన వెంట వార్డ్ మెంబర్ కిలో బెసు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై అవగాహన

ప్రజాశక్తి-ముంచింగి పుట్టు : మండలంలోని పెదగూడ పంచాయతీ గూడమాలిపుట్టు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస బాబు ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో కూరగాయల పెంపకం , మేలైన సాగుల పై అవగాహన కార్యక్రమన్ని గురువారం నిర్వహించారు. వ్యవసాయాధికారి విజయ లక్ష్మి మాట్లాడుతూ కూరగాయ మొక్కలు నాటే ముందు లోతు దుక్కుల్లు చేసుకోవాలన్నారు. వేప పిండి, పశువుల గత్తం సమపాలల్లో కలిపి జల్లుకొని, నారు పోసిన అనంతరం బోదేసాల్ల పద్ధతి లో నారు పొలంలో నాటుకోవాలన్నారు. నాణ్యమైన విత్తనాలు ఎంచుకొని వ్యవసాయాన్ని చేపట్టాలన్నారు. శాస్త్రవేత్త ప్రదీప్, ఏరువాక కేంద్రం పాడేరు ఉద్యనవన అధికారిని శరణ్ పాల్గొన్నారు.

అరకులోయలో డిప్యూటీ అడ్వైజర్ పర్యటన

ప్రజాశక్తి- అరకులోయ :అరకులోయ మండలంలో నీతి అయోగ్ డిప్యూటీ అడ్వైజర్ మురళీధర్ (న్యూఢిల్లీ) గురువారం పర్యటించి వివిధ పనులను పరిశీలించారు. జల ఉత్సవ కార్యక్రమంలో భాగంగా అరకులోయ మండలం మాడగడ గ్రామపంచాయతీ చంపగూడలో ట్రెంచి వర్కు, చినలబుడు గ్రామంలో రోఫ్ వాటర్ హార్వెస్టర్, హాట్టగూడ ఫారం పాండ్ వర్క్, పప్పుడువలస లో జలజీవన్ మిషన్ వర్కు లు పరిశీలించారు. కొత్తవలసలో ఉపాధి హామీ వేతనదారులతో, మేట్స్‌తో సమావేశమై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు.

మత్స్య గెడ్డలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:సుజన్నకోట పంచాయతీ గొడుగుల కుట్టు గ్రామ నివాసి పనసగుడి సొమన్న గ్రామ సమీపంలో మత్స్య గెడ్డలు బుధవారం ఉదయం చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేర స్థానిక ఎస్సై, రెవెన్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టామని ఎస్సై రామకృష్ణ తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు సమయంలో మృతదేహం లభ్యం కావడంతో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కెజిబివిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ధనలక్ష్మి ఆధ్వర్యాన స్థానిక కస్తూరిభాయ్ బాలిక విద్యాలయంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న విద్యార్థినుల రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌లో పరీక్షించారు. టైఫాయిడ్ ఉన్న వారికి మందులు అందజేశారు. క్లోరినేషన్ చేసిన నీరు వేడి చేసిన తాగాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై తెలియజేశారు. గురువారం క్యాన్సర్ డే సందర్భంగా క్యాన్సర్ గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. కరకాలు చుట్ట, బీడీ, పొగాకు, గుట్కాలు, మద్యం వంటివి తాగడం వల్ల కేన్సర్ వస్తుందని, ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భద్రకాళి, పున్నమ్మ, ఏఎన్ఎం పార్వతి, హెచ్ఎ శ్రీనివాస్, ఆశాలు జ్యోతి, సుజాత, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరు వైద్య కళాశాలకు మల్లుదొర పేరు పెట్టాలి

ప్రజాశక్తి-సీలేరు : పాడేరులో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలకు గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు గాము మల్లుదొర పేరు పెట్టాలని ఆదివాసీ నాయకులు గడుతూరి రామ్‌గోపాల్ గురువారం ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. గాము మల్లుదొర విశాఖపట్నం పార్లమెంటు సభ్యుడిగా తొలిసారి ఎన్నికయ్యారని గుర్తు చేశారు. ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు పేరు నామకరణం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే పాడేరు వైద్య కళాశాలకు మల్లుదొర పేరు పెట్టాలని కోరారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ళ పంచాయితీ పరిధి పోకలపాలెం గ్రామంలో యూనిట్ ఇంచార్జి కూనిశెట్టి చంద్రరావు ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం పొందటం వలన ప్రమాదంలో మరణిస్తే రూ.5 లక్షలు బీమాతో పాటు రూ.10వేలు మట్టి ఖర్చులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాడి వెంకటేశ్వర్లు, కొర్ర కామేష్, తాంబేలు దాసు, పాంగి మోహన్, తాంబేలు చిట్టిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం బొడ్లంక వ్యవసాయ ఉద్యానవనం ప్రాంగణంలో మాజీ ఐఎఎస్ అధికారి మనోహర్ ప్రసాద్ సమక్షంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి కుంజం నందిని ప్రకృతి విధానంలో పంటలు ఎలా పండించాలి? ఎరువులు, కషాయాలు ఎలా తయారు చేయాలో తెలియజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో రైతులు పండించే పంటలను సమావేశానికి హాజరైన అధికారులకు స్టాల్స్ ఏర్పాటు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవనశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

11న కెడి.పేటలో జనసేన సమావేశం

ప్రజాశక్తి-కొయ్యూరు : జనసేన పార్టీ కొయ్యూరు మండలం సమావేశం ఈనెల 11న మధ్యాహ్నం గొలుగొండ మండలం కెడి.పేట అల్లూరి సీతారామరాజు పార్క్‌లో జరుగుతుందని ఆ పార్టీ నాయకులు సాగిన బుజ్జిబాబు, జి లక్ష్మణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ క్రియాశీల సభ్యులు హాజరు కావాలని కోరారు.